

పారదర్శకతకు పాతర!
జిల్లా పశుసంవర్ధక శాఖలో ఉద్యోగ బదిలీలు పారదర్శకంగా చేపట్టలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- 8లో ▸



'మాఫీ'కి 680 మంది దూరం
పంట రుణమాఫీకి పలువురు దూరమయ్యారు. వివిధ కారణాలతో 680 మంది రైతులకు మాఫీ డబ్బులు పడలేదు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.5 /23.7

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. శీతల గాలులు వీస్తాయి. రోజంతా వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రెవెన్యూ శాఖలో సాధారణ బదిలీలు

సుభాష్‌నగర్: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని అన్ని శాఖల్లో బదిలీలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా రెవెన్యూ శాఖలో మల్టీజోన్‌-1 పరిధిలోని జిల్లాల నుంచి నిజామాబాద్‌కు స్పౌజ్, నాలుగేళ్ల పూర్తి, అనారోగ్యకారణాలను దృష్టిలో పెట్టుకొని నిబంధనల ప్రకారం 8 మంది తహసీల్దార్లను జిల్లాకు కేటాయించారు. అలాగే మరో ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లను కూడా జిల్లాకు కేటాయిస్తూ సీసీఎల్‌ఏ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సాధారణ బదిలీల గడువును మరో పదిరోజులు పొడిగిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీరంతా త్వరలోనే బాధ్యతలు తీసుకోనున్నారు.

నిజామాబాద్‌నార్త్ ఎఫ్‌ఆర్వో..
డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ నార్త్ ఫారెస్ట్ రేంజ్ అధికారి(ఎఫ్‌ఆర్వో) పద్మారావు బదిలీ అయ్యారు. నిర్మల్ సీసీఎఫ్ ఆధ్వర్యంలో ఎఫ్‌ఆర్వోలకు బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ఇందులో పద్మారావు జగిత్యాల జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో పిట్లం రేంజ్ ఆఫీసర్ సంజయ్‌గౌడ్ రానున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే రానున్నాయి.

ఉన్నత పాఠశాలల వేళల మార్పు

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వేళలను మారుస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇక నుంచి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4.45 నిమిషాల వరకు కొనసాగుతున్నాయి.

అర్హులందరికీ రుణమాఫీ అవుతుంది

ఎడపల్లి(బోధన్): రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడంతో రైతు కుటుంబాలు సంబరాలు చేసుకుంటున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొందరు రైతుల పేరు జాబితాలో రాలేదని.. వారు ఎలాంటి సంకోచం లేకుండా ఉండాలన్నారు. అర్హులైన వారందరికీ రుణమాఫీ వర్తిస్తుందని పేర్కొన్నారు. శనివారం ఎడపల్లిలో రుణమాఫీ అయిన రైతుల కుటుంబాల వద్దకు వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 41 వేల కుటుంబాలు రుణమాఫీతో లబ్ధి పొందాయన్నారు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ. 225 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిద్ధి రామేశ్వర్, గ్రామ రైతులు జుగ్గరి మోహన్, గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి

నిజామాబాద్‌నాగారం: వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ ఆర్.రవీందర్ పేర్కొన్నారు. ఫిర్యాదుల సమస్యల పరిష్కారం కోసం టీజీ ఎన్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని అన్ని ముఖ్య కార్యాలయాల్లో సర్కిల్ ఆఫీస్, డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్‌లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్‌లలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, సర్కిల్ ఆఫీస్‌లో అదేరోజు సమయం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.





దాశరథి కృష్ణమాచార్యులను నిర్బంధించిన జైలు

ఉద్యమానికి ఊపిరిలూదిన దాశరథి



- ఇందూరు ఖిల్లా జైలులో విప్లవ సాహిత్యాన్ని రచించిన దాశరథి కృష్ణమాచార్యులు
- 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని నినదించింది ఇక్కడే
- 'రైతుదే తెలంగాణము రైతుదే'.. అని గొంతెత్తిన దాశరథి
- ఇప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తున్న నాటి దాశరథి సాహిత్యం
- రేపు కృష్ణమాచార్యుల 99వ జయంతి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తన అక్షరాలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూది.. స్వయంగా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన దాశరథి కీర్తి అన్నిదిక్కులకూ వ్యాపించింది. సోమవారం దాశరథి కృష్ణమాచార్య 99వ జయంతి నిర్వహించనున్నారు. నిజాంపాలనలో దాష్టీకాలపై పోరాడిన దాశరథి ఇందూరు ఖిల్లా జైలులో కొన్నేళ్లు గడిపారు. ఈ సమయంలో ఆయన రచించిన సాహిత్యం నైజాంపై పోరుకు మరింత ఊతమిచ్చింది. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ', 'రైతుదే తెలంగాణము రైతుదే' ముసలినక్కకు రాచరికంబు దక్కునే అని నిజాంను ధిక్కరించిన దాశరథి జైలు గోడల మీద బొగ్గుతో సాహిత్యాన్ని రాశారు. 'ఓ నిజాము పిశాచమా..! కానరాడు.. నిన్ను బోలిన రాజు మాకెన్నడేని.. తీగెలను తెంపి అగ్నిలో దింపినావు' అని గొంతెత్తారు. తెలంగాణ ప్రజానీకం దాశరథిని మరచిపోలేరు. తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి ఎలుగెత్తి చాటిన దాశరథి జయంతి నేపథ్యంలో ఆ మహానుభావుడి యాదిలో..

సండే స్పెషల్

■ నైజాం పాలన నుంచి తెలంగాణను విముక్తి చేసేందుకు చేసిన పోరాటం చాలా గొప్పది. అనేక మంది పోరాటాల ఫలితంగా సెప్టెంబర్ 17, 1948లో తెలంగాణ నిజాం పాలన నుంచి విముక్తి పొందింది. ఇందులో దాశరథి పాత్ర అనన్యసామాన్యం. తెలంగాణ గడ్డపై త్రివర్ణ పతాకం రెపరెపలాడడంలో ఆయన తిరుగులేని పాత్ర పోషించారు. ఈ క్రమంలో నిజాంకు వ్యతిరేకంగా రాసిన సాహిత్యం ప్రధాన పాత్ర పోషించింది. అనేక మంది కవులను వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన నిజాం పాలకులు కొంతకాలం పాటు నిజామాబాద్ ఖిల్లా జైలులో బంధించారు. ఇలా బంధించబడిన వారిలో దాశరథి కృష్ణమాచార్యులు, వట్టికోట ఆళ్వారులు తదితరులు ఉన్నారు. దాశరథి కృష్ణమాచార్య నిజామాబాద్ జైలులో మూడు నెలల పాటు ఉన్నట్లు సమాచారం. ఈ సమయంలో దాశరథి జైలు గోడలపై పళ్లు తోముకునే బొగ్గుతో నిజాంపాలనకు వ్యతిరేకంగా సాహిత్యాన్ని రాశారు. 'నా తెలంగాణ కోటి అందాల జాణ.. నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని గోడలపై రాశారు. ఈ నినాదం అప్పటి నిజాం విముక్తి పోరాటంతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో తొలి, మలి విడత ఉద్యమంలోనూ తిరుగులేని విధంగా ఉద్యమాన్ని ముందుకు నడిపింది.




■ దాశరథి తన రచనల ద్వారానే కాకుండా ఊరూరా తిరుగుతూ ప్రజలను చైతన్యవంతం చేశారు. ఉద్యమానికి వేగుచుక్కగా నిలిచిన దాశరథి మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరులో 1925 జూలై 22న జన్మించారు. అక్షర శిఖరమై, తెలంగాణ ఆణిముత్యంగా నిలిచారు. నైజాం నుంచి స్వేచ్ఛ పొందిన అనంతరం దాశరథి 1977 ఆగస్టు 19న రాష్ట్ర ఆస్థాన కవిగా నియమితులై సేవలందించారు. 1978లో గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సొసైటీ నుంచి 'ఆంధ్ర కవితా సారథి' బిరుదు పొందారు. 1987లో కళాసరస్వతి ఆంధ్రరత్న పురస్కారం పొందారు. 1987 నవంబర్ 5న దాశరథి మరణించారు. ఇప్పటికీ దాశరథి సాహిత్యం తెలంగాణ సమాజాన్ని నిరంతరం మేల్కొలుపుతూనే ఉంది. 'మరచిపోండి అన్ని వాదాలు.. మానవతా వాదాలే మన వేదాలు..', 'ఈ జెండా చేతబూని పూజింతాం దేశాన్ని.. ఈ జెండా నీడలోన విడిచేతాం ద్వేషాన్ని..', 'నేడు గెలుపు రేపు ఓటమి.. నేడోటమి రేపు గెలుపు.. అదేరా జీవితం.. మరి ఎందుకు ఏడవటం..', 'పువ్వు తోటి వజ్రమైన తెగిపోతుంది.. పాటతోటి శిలయైనా కరిగిపోతుంది..', 'పేదల గూర్చి నేను మ్రోగింతును రుద్రవీణ.. పలికింతును విప్లవ గీతికావని..' ఇవన్నీ దాశరథి రాసిన రచనల్లో కొన్ని వాక్యాలు. ఇప్పటికీ ఇందూరు ఖిల్లా జైలులో దాశరథి గడిపిన జైలు గోడలు ప్రతిఒక్కరిలో స్ఫూర్తి రగిలిస్తూనే ఉన్నాయి.

ఇందూరుకు ముసురు పట్టింది

- రోజంతా కురిసిన వర్షం
- చురుగ్గా కొనసాగుతున్న వ్యవసాయ పనులు
- ప్రాజెక్టులు, చెరువుల్లోకి చేరుతున్న వర్షపు నీరు

సుభాష్‌నగర్: ఇందూరుకు ముసురు పట్టింది. శనివారం రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. వానాకాలం సీజన్ ప్రారంభమై సుమారు 50 రోజులు కావస్తోంది. ఇన్ని రోజుల తర్వాత కురుస్తున్న వర్షంతో వానాకాలం ఇప్పుడే మొదలైనట్లు కనిపిస్తోంది. జిల్లావ్యాప్తంగా వరి నాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. గడిచిన ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు, చెరువుల్లోకి కొత్త నీరు వచ్చి చేరుతోంది. ఎడతెరిపి లేకుండా పడుతున్న వానలకు వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. 1200పైచిలుకు చెరువుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. జిల్లాలో 13 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 17 మండలాల్లో సాధారణ, 3 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. కమ్మర్‌పల్లిలో 34.3 మిల్లీమీటర్లు, మెండోరాలో 28.0, నవీపేట్‌లో 27.5, బాల్కొండ 24.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మంజీరకు స్వల్ప వరద



మంజీర నదిలో చేరిన వరద నీరు

బోధన్: తెలంగాణ – మహారాష్ట్ర మధ్య సరిహద్దులో సాలూర వద్ద మంజీర నది జలకళ సంతరించుకుంది. నదిలోకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. దీంతో ఇన్నాళ్లు నీరు లేక వెలవెలబోయిన నది కళకళలాడుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశాలున్నాయి.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- జీజీహెచ్ నుంచి ఎత్తుకెళ్లిన దుండగులు
- ప్రత్యేక టీంలతో గాలింపు
- 16 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- మెట్‌పల్లిలో బాలుడు, నిందితులను అదుపులోకి తీసుకున్న బృందాలు
- జిల్లాలో కలకలం రేపిన ఘటన



అరుణ్‌కుమార్

నిజామాబాద్‌నాగారం/ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మూడేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం రేపింది. ఓ వ్యక్తి తన భార్యకు అబార్షన్ చేయించేందుకు ఆస్పత్రికి రాగా కుమారుడితో కలిసి హాల్‌లో నిద్రించాడు. శనివారం తెల్లవారు జామున ఇద్దరు దుండగులు బాలుడిని ఎత్తుకెళ్లారు. కుమారుడు కనిపించకపోవడంతో తండ్రి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఒకటో టౌన్ పోలీసులు రంగంలోకి దిగి 16 గంటల్లో కిడ్నాప్ కథను సుఖాంతం చేశారు.

జరిగింది ఇలా..
నగరంలోని మానిక్‌భండార్‌కు చెందిన సాయినాథ్ తన భార్య స్రవంతికి అబార్షన్ చేయించడానికి శుక్రవారం జీజీహెచ్‌కు తీసుకువచ్చాడు. రాత్రి పూట తన మూడేళ్ల కుమారుడు అరుణ్‌కుమార్‌తో కలిసి వెయిటింగ్ హాల్ వద్ద నిద్రించగా.. ఇద్దరు దుండగులు బాలుడిని ఎత్తుకెళ్లారు. తన భార్య వచ్చి భర్త సాయినాథ్‌ను లేపి కొడుకు అరుణ్‌కుమార్ ఎక్కడా అరా తీసింది. బాబు కనిపించకపోవడంతో సెక్యూరిటీ అక్కడే ఉన్న పోలీస్ సిబ్బందికి చెప్పి వెతికించినా జాడ కనిపించలేదు. దీంతో నిజామాబాద్ ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ ప్రారంభించిన పోలీసులు జీజీహెచ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. శనివారం తెల్లవారు జామున 3.30 గంటలకు ఇద్దరు దుండగులు ఎత్తుకెళ్లినట్లు రికార్డయ్యింది.



ఆస్పత్రిలో నుంచి బాలుడిని ఎత్తుకెళ్తుండగా సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు

కమిషనర్ సీరియస్.. విచారణ ప్రారంభించిన పోలీసులు
బాలుడి కిడ్నాప్ ఘటనపై సీపీ కల్మేశ్వర్ సీరియస్‌గా స్పందించారు. ఒకటోటౌన్ సీఐ ఆధ్వర్యంలో మూడు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని ఆదేశించారు. పోలీసులు నగరంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితులను నగరానికి చెందిన వారీగా పోలీసులు గు ర్తించారు. సాంకేతిక సహాయంతో వారు నిందితులు మెట్‌పల్లికి వెళ్లినట్లు కనుగొన్నారు. వెంటనే బృందం సభ్యులు వెళ్లి సాయంత్రం 7 గంటల సమయంలో బాలుడిని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాలుడి అపహరణ కథ సుఖాంతమైంది. కేవలం 16 గంటల్లోనే పోలీసులు కేసును ఛేదించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- అలా చేస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదవుతాయి
- నిబంధనలు పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు
- జిల్లా జడ్జి సునీత కుంచాల
- పంద్రాగస్టు తర్వాత హెల్మెట్ నిబంధన తప్పనిసరి చేస్తాం: సీపీ



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల, పాల్గొన్న సీపీ కల్మేశ్వర్, ఇతర అధికారులు


ఖలీల్‌వాడి: మైనర్లకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు ప్రమాదాలకు కారణం కావద్దని జిల్లా జడ్జి సునీత కుంచాల సూచించారు. అలా చేసినట్లయితే తల్లిదండ్రులపై కేసులు నమోదవుతాయని జిల్లా జడ్జి సునీత కుంచాల పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా పోలీస్ శాఖ, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం 'మైనర్ డ్రైవింగ్ – డ్రంకన్ డ్రైవింగ్' అంశంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్, నిర్లక్ష్యం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా 18 ఏళ్లలోపు వయస్సు కలిగిన మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా వారి కుటుంబాలతో పాటు సమాజానికి, ఇతరులకు కూడా తీరని నష్టం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే, వారితో పాటు తల్లిదండ్రులకు కూడా చట్ట ప్రకారం మూడేళ్ల కారాగార శిక్ష, రూ. 25 వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మైనర్లు వాహనాలు నడిపేందుకు అనుమతించకూడదని సూచించారు. ప్రభుత్వం ఎంతటి కఠిన చర్యలు చేపట్టినా ప్రజల ఆలోచనా విధానాల్లో మార్పు రానంతవరకు రోడ్డు ప్రమాదాల పరిస్థితిలో మార్పు రాదని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఓవర్ టేక్ చేయడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్ ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో గత ఏడాదిన్నర కాలంలోనే రోడ్డు ప్రమాదాల్లో 550 మంది ప్రాణాలు కోల్పోయారని వివరించారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు విధిగా సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. వచ్చే ఆగస్టు 15 తర్వాత హెల్మెట్ నిబంధనను తప్పనిసరి చేస్తామని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదస్సులో ఏడో బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

- ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు
- 'సాక్షి ఫోన్‌ఇన్'కు ఫిర్యాదుల వెల్లువ
- పలు సమస్యలను వివరించిన పట్టణవాసులు



సాక్షి ఫోన్ ఇన్

ఆర్మూర్ పట్టణ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ రాజు పేర్కొన్నారు. సాక్షి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మున్సిపల్ కమిషనర్‌కు పట్టణవాసులు ఫోన్ చేసి పట్టణంలో నెలకొన్న సమస్యలను వివరించారు. కాలనీల్లో కుక్కలు, పందులు, కోతులతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఫిర్యాదు చేయగా, ఓపెన్ ప్లాట్లలో పెరిగిన పిచ్చిమొక్కలతో పాములు, తేళ్లు వస్తున్నాయని తెలిపారు. కమిషనర్ ప్రజల సమస్యలను సావధానంగా వింటూ సమాధానం ఇచ్చారు. పట్టణంలోని సమస్యలను పరిష్కరిస్తాన్నారు.

– ఆర్మూర్ టౌన్

ప్రశ్న: హుస్నాబాద్ కాలనీలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది, రాత్రి సమయంలో దాడులకు పాల్పడుతున్నాయి?
– పులి గంగాధర్, హుస్నాబాద్ కాలనీ, 35వ వార్డు

కమిషనర్ రాజు: పది రోజుల్లో ప్రభుత్వం నుంచి గైడెన్స్ రాగానే కుక్కలపై నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

■ స్లాటర్ హౌస్ పక్కన చెత్తాచెదారం ఎక్కువగా ఉంది. దోమలు వృద్ధి చెందడంతో అనారోగ్య బారిన పడుతున్నాం ?
– వాజిద్, జిరాయత్ నగర్, 14వ వార్డు


■ మున్సిపల్ సానిటరీ ఎస్సైకి చెప్పి రోడ్డుపై పడి ఉన్న చెత్తను తొలగింజేస్తాం. ప్రజలు రోడ్లపై చెత్తను వేయకుండా అవగాహన కల్పిస్తాం.

■ 1300 ప్లాట్ల కాలనీలో డ్రెయినేజీలు, రోడ్లు లేవు. వర్షపు నీరు రోడ్లపై నిలుస్తుండడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నాం ?
– రజాక్, 1300 ప్లాట్ల కాలనీ

■ మున్సిపల్ కౌన్సిల్‌లో మురికి కాల్వలు, రోడ్ల పనులకు సంబంధించి తీర్మానం చేసి పనులు చేపడతాం. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చివేయిస్తాం.

■ జిరాయత్ నగర్, మామిడిపల్లిలతో పాటు శాస్త్రి నగర్‌లో ఓపెన్ ప్లాట్లలో వర్షపు నీరు ఒకేచోట నిలుస్తోంది. దీనివల్ల దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి?
– శ్రావణ్, మామిడిపల్లి/సాజిద్, జిరాయత్‌నగర్/రాము, శాస్త్రి నగర్

■ కాలనీలో అపరిశుభ్రంగా ఉన్న ఓపెన్‌ప్లాట్ల యజమానులకు ముందస్తు సమాచారం ఇస్తాం. అయిన వారు వినకపోతే నోటీసులు జారీ చేస్తాం.




మహాలక్ష్మి కాలనీలో రోడ్డు పరిస్థితి

■ కాలనీలో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉంది. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని పట్టుకుని తరలించాలి ?
– మారుతి, కమలానగర్ కాలనీ

■ మహాలక్ష్మి కమాన్ వద్ద రోడ్డుపై శిలాఫలకం వేయడంతో మురికినీరు వెళ్లకపోవడంతో నిలిచిపోతుంది –మనోహర్, యోగేశ్వర కాలనీ

■ శిలాఫలకం గురించి వీడీసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. మురికి ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.



పట్టణంలో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

■ కుక్కలను, కోతులను పట్టుకునేందుకు ఉన్నతాధికారుల నివేదిక రాగానే వాటిపై చర్యలు తీసుకొని ఇబ్బంది లేకుండా చూస్తాం.

■ వార్డుల్లో దోమలు నియంత్రించడానికి ఫాగింగ్ చేయడంతో పాటు ఆయిల్ బాల్స్ వదలాలి ?
– ఆకుల రాము, మామిడిపల్లి, 24వ వార్డు

■ మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి సోమవారం గంబూషియా చేపలు నిజాంసాగర్ కెనాల్‌లో వదులుతాం. మున్సిపల్ సిబ్బందితో కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు ఫాగింగ్ చేయిస్తాం.

■ ఆదర్శ నగర్‌లో మురికి నీరు డ్రెయినేజీలో నిలిచిపోవడంతో రోడ్డుపైకి చేరుతోంది.
– నర్సయ్య, ఆదర్శనగర్, మామిడిపల్లి

■ డ్రెయినేజీల్లో పూడికను తొలగించి మురికినీరు వెళ్లేలా చూస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటాం.

■ పట్టణంలోని కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఇంటికి వెళ్లాలంటే చాలా భయంగా ఉంది. రోడ్లపై వెళ్తుంటే వెంట పడుతున్నాయి? – ఆదిల్, రాజారాంనగర్

■ పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉన్న విషయం వాస్తవమే. ఉన్నతాధికారులు ఆదేశిస్తే వాటిని పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తాం.

■ మా కాలనీలో కొందరు కుక్కలకు మాంసం వేసి పెంచుతున్నారు. శునకాలు రోడ్లపై స్వైరవిహారం చేస్తుండడంతో పిల్లలు ఆడుకోవాలంటే భయపడుతున్నారు. – భరత్, హుస్నాబాద్ గల్లీ

■ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. కుక్కలకు మాంసం వేసి పెంచుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

క్లుప్తంగా

నూతన చట్టాలపై అవగాహన



ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి వైజయంతి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి లక్ష్మీనర్సయ్య, ఉమ్మడి జిల్లాలోని కోర్టుల్లో విధులు నిర్వర్తిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష నిర్వహించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టాలపై డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య అవగాహన కల్పించారు. ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రద్ధతో విధులను నిర్వర్తించాలని, నూతన చట్టాల ఆధారంగా నేరస్తులకు శిక్షపడే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం బదిలీపై వచ్చిన ఎండీ రహీమొద్దీన్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(నిజామాబాద్), జి రామకృష్ణ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ప్రథమ శ్రేణి కోర్టు, ఆర్మూర్)ను సన్మానించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్, శ్యామ్‌రావు, సమ్మయ్య, ఖాందేశ్ శ్రీనివాస్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు భూసారపు రాజేశ్‌గౌడ్, మహ్మద్ రహీమొద్దీన్, అశోక్, శివ రాంనాయక్, చిదిరాల రాణి, జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పరీక్షలకు 8 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ వన్ టైం చాన్స్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు శనివారం 8 మంది గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. వర్సిటీ పరిధిలోని గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్(నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (కామారెడ్డి), ఎస్‌ఆర్‌ఎన్‌కె ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (బాన్సువాడ), గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ (ఆర్మూర్) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 48 మందికి గాను 44 మంది విద్యార్థులు హాజరు కాగా, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 80 మందికి 76 మంది హాజరైనట్లు వివరించారు. మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, న్యాయ కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు ఉదయం 104 మంది విద్యార్థులకు గాను 101 మంది హాజరు కాగా, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 156 మందికి గాను 143 మంది హాజరైనట్లు వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: గురుబ్రహ్మ, గురుశిరోమణి పురస్కారాలకు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన సర్వేజనా: సుఖినోభవంతు(సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ) వ్యవస్థాపక అధ్యక్షుడు ఈఎస్‌ఎస్ నారాయణమాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, కరాటే, ఆధ్యాత్మికం, నాటకరంగం, టీవీ, సినీ రంగాల్లో సేవలందిస్తున్న వారు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సర్వేజనా సుఖినోభవంతు, డోర్ నంబర్ 1-20-164, తిరుమలగిరి, కోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్-15 అడ్రస్‌కు దరఖాస్తులను పంపించాలని, పూర్తి వివరాలకు 965 2347207ను సంప్రదించాలని సూచించారు.

రుణమాఫీకి 680 మంది దూరం

- వివిధ కారణాలతో జమకాని మాఫీ సొమ్ము
- వివరాలను ప్రభుత్వానికి పంపిన వ్యవసాయ శాఖ



డొంకేశ్వర్(ఆర్మూర్): పంట రుణమాఫీకి జిల్లాలో పలువురు రైతులు దూరమయ్యారు. వివిధ కారణాలతో 680మంది రైతుల ఖాతాల్లో మాఫీ డబ్బులు పడలేదు. దీంతో సంబంధిత రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా జిల్లాలో 44,469 మంది రైతులకు రూ. 225.62 కోట్ల పంట రుణాల డబ్బులను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, శనివారం నాటికి ఎంతమంది రైతుల ఖాతాల్లో డబ్బులు పడ్డాయనే వివరాలు జిల్లా వ్యవసాయ శాఖకు అందాయి. మొత్తం 44,469 మంది రైతులకు గాను 43,789 మంది రైతులకు ఖాతాల్లో మాఫీ డబ్బులు పడ్డాయి. ఇంకా 680మంది రైతులు మాఫీకి దూరంగా ఉన్నారు. ఇందులో బ్యాంకు ఖాతాలు మూతబడిన రైతులు 116 మంది, ఖాతాలు సరిగ్గాలేని వారు 258 మంది, డేటా సరిగ్గాలేని వారు 304 మంది, అలాగే ఇతర కారణాలతో పేమెంట్ నిలిచిపోయిన రైతులు ఇద్దరు ఉన్నారు. ఇలాంటి రైతుల వివరాలను సేకరించిన వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం వీరికి మాఫీ సొమ్మును అందజేస్తుందో లేదో స్పష్టత లేదు.

వ్యవసాయాధికారులకు ఫిర్యాదుల వెల్లువ

రాష్ట్ర ప్రభుత్వం చేసిన రూ. లక్షలోపు రుణమాఫీ డబ్బులు జిల్లాలోని కొంతమంది రైతుల ఖాతాల్లో జమ కాలేదు. చాలా మందికి గురువారం రాత్రి వరకు సెల్‌ఫోన్లకు సందేశాలు రావడంతో రాని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండురోజులు గడిచినా తమకెందుకు జమకాలేదని అయోమయానికి గురవుతున్నారు. ఎక్కువగా సహకార బ్యాంకుల్లో రుణాలు పొందిన వారికి ఇంకా మాఫీ సమాచారం అందలేదు. దీంతో రుణమాఫీ సమాచారాన్ని తెలుసుకునేందుకు రైతులు బ్యాంకులు, సొసైటీలకు వద్దకు వెళ్తున్నారు. అలాగే స్థానిక వ్యవసాయాధికారులకు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్‌కు ఇప్పటి వరకు దాదాపు 300 మందికి పైగా రైతులు ఫోన్లు చేశారు. రుణమాఫీ జరిగిందో లేదో ఎలా చూసుకోవాలని అధికారులను అడుగుతున్నారు.

గ్రామాల్లో ఏఈవోలు, మండల వ్యవసాయాధికారులను సంప్రదించగా వారు రైతు ఆధార్ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో స్టేటస్ చూసి సమాధానాలిస్తున్నారు. జాబితాలో పేరు వచ్చినప్పటికీ తమకు రుణమాఫీ డబ్బులు పడలేదని, రూ.లక్షలోపు రుణం ఉన్నా జాబితాలో పేరెందుకు రాలేదని ఎక్కువ శాతం ఫిర్యాదులు అందుతున్నాయి. అలాగే రుణమాఫీకి అర్హత ఉండి రేషన్ కార్డు లేని రైతులకు కూడా మాఫీకాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల బ్యాంకర్లు వడ్డీ వసూలు చేస్తున్నారని కూడా వ్యవసాయాధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది.

కల్లుబట్టీలో మద్యం పట్టివేత



ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

- డిపో నిర్వాహకుల ఒత్తిడితో వదిలేశారని ఎక్సైజ్ అధికారులపై ఆరోపణలు

ఖలీల్‌వాడి: ఈనెల 16న నగరంలోని గుర్బాబాది ప్రాంతంలోని ఓ కల్లుబట్టీలో తనిఖీలు నిర్వహించిన ఎక్సైజ్ అధికారులకు మద్యం పట్టుబడగా డిపో నిర్వాహకుల ఒత్తిడి కారణంగా వదిలేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గుర్బాబాది ప్రాంతంలోని ఓ ఆలయానికి సమీపంలో ఉన్న కల్లు దుకాణంలో మద్యం విక్రయిస్తున్నారని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు అందగా, ఎస్‌హెచ్‌వో దిలీప్, ఎస్సై సుస్మితతోపాటు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రూ.36 వేల విలువైన మద్యం పట్టుబడిందని, డిపో నిర్వాహకులు ఫోన్‌లు చేయడంతో మద్యాన్ని ఎస్‌హెచ్‌వో దిలీప్ మధ్యలోనే కల్లుబట్టీ నిర్వాహకులకు ఇచ్చేశారని తెలిసింది. గల్లీల్లో మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు పెడుతూ.. కల్లు బట్టీలో మద్యం దొరికినా కేసు నమోదు చేయడంకపోవడమేమిటని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర కమిషనర్‌కు నగరానికి చెందిన పలువురు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. దీనిపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డిని వివరణ కోరగా.. ఎస్‌హెచ్‌వో దిలీప్, ఎస్సై సుస్మితను వివరణ కోరుతానని చెప్పారు.

ముందుకు సాగని విచారణ

మూడో కల్లుడిపో పరిధిలో బట్టీల ఏర్పాటుపై విచారణ చేపట్టాలని ఎస్‌హెచ్‌వో దిలీప్‌కు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మెమో జారీ చేసినప్పటికీ విచారణ ప్రక్రియ ముందుకుసాగడం లేదు. రెండు రోజులు గడుస్తున్నా ఎస్‌హెచ్‌వో విచారణకు వెళ్లడం లేదని, డిపో నిర్వాహకులతో అధికారి కుమ్మక్కు కావడమే దీనికి కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడో డిపో పరిధిలో రెండు కల్లుదుకాణాల ఏర్పాటుపై ఎస్‌హెచ్‌వో విచారణ ఎప్పుడు పూర్తి చేసి ఉన్నతస్థాయి అధికారులకు నివేదిక అందజేస్తారనే చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా, కల్లు దుకాణాల ఏర్పాటుపై విచారణ చేపట్టి త్వరగా నివేదిక అందజేయాలని ఎస్‌హెచ్‌వోను ఆదేశించామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు.

సీపీఐ ధర్నా

నగరంలోని కల్లు డిపోల పరిధిలో కల్తీకల్లు విక్రయిస్తున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలను నియంత్రించేందుకు కృషి చేస్తున్నా ఫలితం లేకుండా పోతోందన్నారు. నగరంలోని కల్లుడిపోల్లో కల్లుగీత కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

దాశరథికి ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న శబ్ద తరంగిణి సభ్యులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నగరంలోని శబ్ద తరంగిణి సంస్థ కార్యాలయంలో దాశరథి కృష్ణమాచార్యుల 99వ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. దాశరథి తన సందేశంలో 'నా తెలంగాణ కోటి రతనాల వీణ అని చెప్పి నైజాంపై పోరును మరో దశకు తీసుకెళ్లారన్నారు. సంస్థ అధ్యక్షుడు సేర్ల దయానంద్ మాట్లాడుతూ.. ఖిల్లా జైలు గోడల మీద దాశరథి ఎన్నో పద్యాలు రచించారన్నారు. చైతన్యసారథి, పాటలవారధి అంటే దాశరథి మాత్రమేనన్నారు. రిటైర్డ్ ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ ఎ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఓ నిజాము పిశాచమా, కానరాడు నిన్ను బోలిన రాజు' అని దాశరథి నినదించారన్నారు. కార్యక్రమంలో రాపెల్లి శ్రీనివాస్, కవి పోతన్నారి లక్ష్మణ్, రాజుబాబు, సురేశ్, ప్రవీణ్‌కుమార్ బంధన్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

22న సాహిత్య పురస్కారాలు

నిజామాబాద్‌అర్బన్: దాశరథి కృష్ణమాచార్యుల 99వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని ఈనెల 22న నగరంలోని గీతా భవనంలో సాహిత్య పురస్కారాలను అందజేస్తామని శ్రీపాద కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాదకుమారశర్మ, జనగామ చంద్రశేఖరశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, సాహిత్య రంగంలో మేడిచర్ల ప్రభాకరరావు, చరిత్ర పరిశోధన రంగంలో కందకుర్తి యాదవరావు, కళా సాంస్కృతిక రంగంలో మేక రామ స్వామి, సంగీత నాటక రంగంలో కిషన్‌రావు దేశ్ పాండేకు పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రోడ్డుప్రమాదంలో గాయపడి మంచానికి పరిమితమైన పేద బ్రాహ్మణుడికి బ్రాహ్మణ సంక్షేమ సంఘం శనివారం ఆర్థిక సహాయం అందించింది. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన కిషన్‌రావు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తుండగా, ఆయన భార్య శిల్ప గతంలో కొవిడ్‌తో మరణించింది. పౌరోహిత్యం చేస్తున్న కిషన్‌రావు కుమారుడు వెంకటసాయి కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో వెన్నుముక దెబ్బతిని మంచానికి పరిమితమయ్యాడు. సొంతిల్లు సైతం లేని పేద బ్రాహ్మణ కుటుంబ పరిస్థితిని తెలుసుకొని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిరణ్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు వైద్యం ఖర్చుల నిమిత్తం రూ.60 వేల చెక్కును అందించారు. కిరణ్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. పేద బ్రాహ్మణ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు రూ.7 లక్షలు వైద్యానికి ఖర్చయ్యాయని, దాతలు సైతం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రొట్టె సురేశ్‌శర్మ, కోశాధికారి పులకల్ రమేశ్, ఉపాధ్యక్షులు ఉదయ్ భోదంకర్, పురుషోత్తమ్ పట్వారి, సభ్యులు మెడిచర్ల శ్రీనాథ్, లక్ష్మీనారాయణ భరద్వాజ్, మల్లికార్జునరావు, అమరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతకు పాతర!



ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉద్యోగిని

- పశుసంవర్ధకశాఖలో ఉద్యోగ బదిలీలపై విమర్శలు
- తనకు అన్యాయం జరిగిందని ఓ ఉద్యోగిని కంటతడి

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా పశుసంవర్ధక శాఖలో శనివారం జరిగిన ఉద్యోగ బదిలీలు పారదర్శకంగా చేపట్టలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీనియర్లను పక్కను పెట్టేసి యూనియన్ పేరుతో జూనియర్లను అందలం ఎక్కించారని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. తనకు అన్యాయం చేశారని ఓ ఉద్యోగిని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆవేదన వ్యక్తం చేస్తూ కంటతడి పెట్టింది. జోనల్, మల్టీ జోనల్ పోస్టులైన వెటర్నరీ అసిస్టెంట్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ పోస్టులకు పశుసంవర్ధక శాఖలో శనివారం బదిలీ కౌన్సెలింగ్ చేపట్టారు. బదిలీలకు ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు అవకాశం ఇచ్చినప్పటికీ వర్షం కురుస్తున్నా రాత్రి 10 గంటల వరకు బదిలీ ప్రక్రియను అధికారులు కొనసాగించారు. రాష్ట్ర శాఖ డైరెక్టర్ ఆధర్యంలో జూమ్ మీటింగ్ ద్వారా ఈ బదిలీలు జరిగాయి. అయితే, జేవీవో బదిలీల్లో అన్యాయం జరిగినట్లు కనిపిస్తోంది. అంక్సాపూర్‌లో పని చేస్తున్న ఓ ఉద్యోగిని సీనియార్టీలో 12వ స్థానంలో ఉంది. ఇమెను కాదని తాలుకా యూనియన్ పేరుతో వచ్చిన ఒక సీనియర్ ఉద్యోగికి నిజామాబాద్ జిల్లాలోనే కొనసాగేందుకు అవకాశం ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సదరు మహిళ వేరే జిల్లాకు వెళ్లాల్సి వచ్చింది. బదిలీల్లో మినహాయింపు కేవలం జిల్లా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకే ఇవ్వాల్సి ఉంటుందని, తాలూకా సంఘానికి పని చేస్తున్న వారికి మినహాయింపు ఇవ్వడం ఏమిటని సదరు ఉద్యోగిని ప్రశ్నించింది. దీనిపై జేడీ జగన్నాథచారిని 'సాక్షి' వివరణ కోరగా.. బదిలీ కౌన్సెలింగ్ తమ పరిధిలో జరగలేదని, నేరుగా డైరెక్టర్ చేస్తున్నారని తెలిపారు. బదిలీ అభ్యంతరంపై డైరెక్టర్‌ను కలిసి విన్నవించుకోవాలని సూచించామని ఆయన అన్నారు.

గిరిజన మహిళకు పాము కాటు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని కొయ్యగుండుతండాకు చెందిన జీరి అనే గిరిజన మహిళను శనివారం పాము కాటేసినట్లు తండావాసులు తెలిపారు. పాముకాటు వేసిన వెంటనే కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది తండాకు చేరుకొని మహిళకు ప్రథమ చికిత్స నిర్వహించి కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మహిళ చికిత్స పొందుతోంది. వైద్యులు ప్రాణాపాయం తప్పిందని పేర్కొన్నారు. సమయానికి స్పందించిన 108 సిబ్బందికి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్లతో ప్లాట్ విక్రయం.. అరెస్ట్



నిందితులు శ్రీనివాస్, గంగాధర్

కామారెడ్డి క్రైం: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి వేరే వ్యక్తి ప్లాట్‌ను విక్రయించిన ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన కలిమెళ్ల రాజయ్య పట్టణంలోని గాంధీనగర్‌లో 200 గజాల ప్లాటును 2002లో కొనుగోలు చేశాడు. కొద్ది రోజుల తర్వాత అతడు అనారోగ్యంతో చనిపోగా, వీక్లీ మార్కెట్ ప్రాంతంలో నివాసం ఉండే మార శ్రీనివాస్ ఆ ప్లాట్‌పై కన్నేశాడు. నకిలీ పత్రాలు సృష్టించిన శ్రీనివాస్.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాయంలో మృతుడి కుమారుడిగా ఆరేటి గంగాధర్‌ను చూయించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ తరువాత ప్లాట్‌ను మరో వ్యక్తికి విక్రయించాడు. అయితే, తమ ప్లాట్‌లో వేరే వారు కబ్జా ఉండటాన్ని గమనించిన రాజయ్య కుమారుడు మహేందర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అసలు విషయం వెలుగు చూసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, గంగాధర్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

బస్సులో తల్లీకూతుళ్ల చేతివాటం

- కండక్టర్‌తోపాటు ఇద్దరు ప్రయాణికుల డబ్బులు చోరీ
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

భిక్కనూరు: ఆర్టీసీ బస్సులో తమ చేతివాటాన్ని ప్రదర్శించిన తల్లీకూతుళ్లు కండక్టర్‌తోపాటు ఇద్దరు ప్రయాణికల డబ్బులను కొట్టేశారు. ఈ ఘటన భిక్కనూరులో శుక్రవారం అర్ధరాత్రి రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఆర్మూర్ డిపోకు చెందిన బస్సు హైదరాబాద్ నుంచి వస్తుండగా భిక్కనూరు బస్టాండు వద్ద కండక్టర్ రాచర్ల నారాయణ తన వద్ద జేబులో పెట్టుకున్న రూ.6,640 కనిపించడం లేదని కేకలు వేశాడు. ఆవెంటనే మరో ఇద్దరు ప్రయాణికులు తమ రూ.8,500 కనిపించడం లేదని తెలిపారు. జంగంపల్లి శివారులో బస్సును నిలిపి వేయించిన కండక్టర్.. డయల్ 100కు ఫిర్యాదు చేయగా, ఘటనాస్థలానికి భిక్కనూరు పోలీసులు చేరుకొని ప్రతి ఒక్కరినీ తనిఖీ చేశారు. దీంతో బస్సులో ఉన్న హైదరాబాద్‌కు చెందిన తల్లీకూతుళ్లు బొంతల లక్ష్మి, కవిత వద్ద రూ.15వేల నగదు పట్టుబడింది. పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా, బస్సులో చోరీకి పాల్పడిన తల్లీకూతుళ్లు వారం రోజుల క్రితం కామారెడ్డికి వచ్చి ఇంటిని అద్దెకు తీసుకున్నారని, అక్కడే ఉంటూ చోరీకి పాల్పడుతున్నారని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

దోమకొండలో..

దోమకొండ: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహదారు షబ్బీర్‌అలీ పాల్గొనగా, ఇదే అదునుగా దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం అనంతరం మండల కాంగ్రెస్ కార్యాలయాన్ని షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఇదే సమయంలో సంఘమేశ్వర్ మాజీ సర్పంచ్ జెట్టబోయిన నరేశ్‌కు చెందిన రూ.2వేలు, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్‌కి చెందిన రూ.5వేలు, సింగిల్‌విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డికి చెందిన రూ.5వేలు, గొట్టిముక్కుల గ్రామ మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డికి చెందిన రూ.10వేలతో పాటు మరో ఇద్దరికి చెందిన డబ్బులు చోరీకి గురయ్యాయి. కార్యక్రమం పూర్తయిన తరువాత తమ డబ్బులు చోరీకి గురైనట్లు గుర్తించిన నాయకులు విస్తుపోయారు. గతంలో సైతం పలు కార్యక్రమాల్లో ఇదే విధంగా డబ్బులు చోరీ అయ్యాయని వారు తెలిపారు.

క్రైం కార్నర్

బహ్రెయిన్‌లో మెండోరా వాసి మృతి

- మృతదేహాన్ని తెప్పించాలని భార్యాపిల్లల వేడుకోలు



మాకూరి వినోద్(ఫైల్)



వినోద్ భార్యాపిల్లలు

బాల్కొండ: బతుకుదెరువు కోసం భార్యాపిల్లలను వదిలి బహ్రెయిన్‌కు వెళ్లిన మెండోరా మండల కేంద్రానికి చెందిన మాకూరి వినోద్(35) అక్కడ జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. పైపులైన్ కందకం తవ్వకం పనులు చేస్తుండగా కందకం కూలడంతో వినోద్ అక్కడికక్కడే మృతి చెందినట్లు నాలుగు రోజుల తరువాత కుటుంబ సభ్యులకు శనివారం సమాచారం అందింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తన భర్త మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య యమున వేడుకుంటోంది.

నాలుగేళ్ల క్రితం వెళ్లి..

కుటుంబాన్ని వదిలి నాలుగేళ్ల క్రితం బహ్రెయిన్‌కు వెళ్లిన వినోద్.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేక పోవడంతో కనీసం సెలవుపై కూడా రాలేదు. బహ్రెయిన్‌లో ఆజాద్ వీసాపై పని చేస్తున్న వినోద్ మృతి చెందగా, ఏ కంపెనీ పట్టించుకోవడం లేదని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. మృతుడికి భార్య యమున, కుమార్తె అక్షిత, కుమారుడు అర్వింద్ ఉన్నారు.

గుండెపోటుతో జీపీ కార్మికుడి మృతి



జంగం గోపి (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ జంగం గోపి(38)శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. గోపి గత ఐదేళ్లుగా గ్రామ పంచాయతీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో గోపికి గుండెపోటు వచ్చింది. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. అంత్యక్రియలకు మాజీ సర్పంచ్ లతాదేవరాజ్, ఎంపీడీవో సతీశ్‌కుమార్, జీపీ కార్యదర్శి హరీశ్, సిబ్బంది హాజరయ్యారు. జీపీ తరపున రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

ఖలీల్‌వాడి: కుటుంబ కలహాల కారణంగా నగరంలోని ముజాహిద్‌నగర్‌కు చెందిన ఎజాజ్(38) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై అశోక్ శనివారం తెలిపారు. ఎజాజ్ తరచూ భార్యతో గొడవ పడుతుండడంతో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. పుట్టింటికి ఆమె చేరకపోవడంతో ఆమెర తరపు బంధువులు ఎజాజ్‌ను నిలదీశారు. విడాకులు చేస్తామని చెప్పడంతో మనస్తాపానికి గురైన ఎజాజ్ శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని రైతు..



రమావత్ దేవ్లా (ఫైల్)

రాజంపేట: కేజీవీల్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా వెనక్కి నడిపి ఢీకొట్టిన ఘటనలో మండలంలోని శంకర్‌తండాకు చెందిన రైతు రమావత్ దేవ్లా (61) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన దేవ్లాకు 10 గుంటల వ్యవసాయభూమి ఉంది. నీటి సదుపాయం లేకపోవడంతో పక్కనే ఉన్న కాత్రోత్ వాచ్య అనే రైతు భూమిలో నుంచి నీటిని వాడుకునేందుకు అనుమతి తీసుకున్నాడు. శనివారం ఉదయం 11గంటలకు తన పొలానికి నీరు పెట్టేందుకు కాత్రోత్ వాచ్య పొలంలోని పైపుగేట్‌వాల్‌ను దేవ్లా తిప్పుతున్నాడు. అదే సమయంలో కాత్రోత్ వాచ్య చిన్న కుమారుడు రాములు కేజీవీలు ట్రాక్టర్‌తో పని చేస్తూ అజాగ్రత్తగా వెనక్కి తీసుకురావడంతో దేవ్లాను ఢీకొన్నది. గాయాలపాలైన దేవ్లాను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న వ్యక్తిపై దాడి



గాయాలపాలైన కర్నె మహేందర్

భీమ్‌గల్: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న వ్యక్తిపై రాళ్లతో దాడి చేసిన ఘటన మండలంలోని బెజ్జోరా గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేశ్(బీఆర్‌ఎస్)తోపాటు మరికొందరు ముచ్కూర్ గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై శుక్రవారం అర్ధరాత్రి తిరిగి వస్తుండగా బెజ్జోరా గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు కనిపించాయి. వెంటనే ట్రాక్టర్లను అడ్డుకోగా, ఆగ్రహానికి గురైన ఇసుక వ్యాపారులు వారిపై దాడి చేయగా అందరూ తప్పించుకున్నారు. ఇసుక వ్యాపారులైన పిట్ల రాజు, శ్రీరాం రవికి బీఆర్‌ఎస్ కార్యకర్త మహేందర్ చిక్కగా భాస్కర్ అనే వ్యక్తి రాళ్లతో దాడి చేశాడు. మహేందర్ స్పృహ కోల్పోవడంతో దాడిచేసిన వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఘటనాస్థలానికి చేరుకున్న స్నేహితులు గాయాలపాలైన మహేందర్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నాయని ఫిర్యాదులు అందుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో తహసీల్దార్ శ్రీలతకు ఇసుక అక్రమరవాణాపై పలుమార్లు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందాయని పలువురు పేర్కొంటున్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని ఖాజాపూర్‌లో చాకలి సౌజన్య అనే మహిళ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారని రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. సౌజన్యం శుక్రవారం ఇంటికి తలం వేసి పొలం పనులకు వెళ్లిందని, సాయంత్రం తిరిగి వచ్చేసరికి చోరీ జరిగిందన్నారు. ఇంట్లో దాచిన మూడు తులాల బంగారు ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడు దుకాణాల్లో ..

కామారెడ్డి క్రైం : కామారెడ్డి మున్సిపల్ పరిధి లోని తాళం వేసి ఉన్న మూడు దుకాణాల్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. దేవునిపల్లిలో నివాసం ఉండే కాటిపల్లి శ్రీకాంత్ స్థానికంగా ఓ ట్రేడర్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం షాప్‌కు వచ్చి చూసేసరికి చోరీ జరిగినట్లు గుర్తించాడు. దుకాణం పైభాగంలో ఉన్న రేకులను తొలగించి లోనికి చొరబడినట్లు తెలుస్తుంది. అతనితో పక్కనే ఉన్న మరో రెండు దుకాణాల్లోనూ ఇదే తరహాలో దొంగలు పడ్డారు. శ్రీకాంత్ దుకాణంలోని కౌంటర్ నుంచి రూ. 3 వేల నగదు, సెల్‌ఫోన్ అపహరణకు గురయ్యాయి. దేవునిపల్లి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాపర్ వైరు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేసి ఆయిల్, కాపర్ వైరును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే మాకం రాములు ఫామ్‌హౌస్ తాళాలను పగులగొట్టి సోలార్ బ్యాటరీ, కేబుళ్లు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారన్నారు. ఈ ఘటనపై రాములు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.